పద్దుకు వేళాయెరా..

రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే

న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

హెచ్‌ఆర్‌ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్‌ఆర్‌ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.



చివరగా..

ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్త దానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముమ్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.

బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

వీ అనంత నాగేశ్వరన్: ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

మనోజ్ గోవిల్: ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

అజయ్ సేథ్: ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

తుహిన్ కాంత పాండే: ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

అరుణిష్ చావ్లా: ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

ఎం నాగరాజు: త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.

ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేదోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

కనిపించని చిత్తశుద్ధి..

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

ఎన్ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపారాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్ఎల్‌సీలో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు

ప్రశాంతంగా పర్యావరణ విద్య పరీక్ష

డీఐఈఓకి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు

ఖమ్మం అర్బన్, జనవరి 30 : ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గురువారం నిర్వహించిన పర్యావరణ విద్య పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించారు. తప్పనిసరిగా రాయాల్సిన పరీక్ష కావడంతో విద్యార్థులు 17,899 మందికి 17,493 మంది హాజరై 406 మంది గైర్హాజరయ్యారు. 97 శాతానికిపైగా హాజరయ్యారు. పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.రవిబాబు తనిఖీ చేశారు.

ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల వినతిపత్రం...

ప్రభుత్వం ప్రాక్టికల్స్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చాలనే నిబంధన పెట్టడంతో సీసీ కెమెరాలు అమర్చడం సాధ్యంకాదని గురువారం జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో డీఐఈవో రవిబాబుకి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా శేషగిరి, వీరారెడ్డి, రెజొనెన్స్ నాగేంద్రకుమార్, హార్వెస్ట్ రవిమారుత్, కృష్ణవేణి వెంకటేశ్వరరావు, డాక్టర్స్ అకాడమీ సతీష్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థి సంఘం ఆవిర్భావ సభ

సంఘం ఆవిర్భావ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం సిటీ, జనవరి 30 : రెండు తెలుగు రాష్ట్రాల్లోని మాల జాతి అభ్యున్నతి, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం చేసే ప్రయత్నాల్లో భాగంగా శుక్రవారం ఖమ్మం బైపాస్ నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ ప్రగతిశీల మాల విద్యార్థి సమాఖ్య ఆవిర్భావ సభను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు దాసరి వీరబాబు తెలిపారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలజాతి ఔన్నత్యాన్ని గుర్తించడమే లక్ష్యంగా తమ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ, మెడికల్, ఇంజినీరింగ్, యూనివర్సిటీల్లో చదువుకుంటున్న విద్యార్థులతోపాటు జాతికి చెందిన రాజకీయ నాయకులు, మేధావులు, పెద్దలు, సభ్యులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మగ్రి ప్రకాష్, దాసరి వీరబాబు, గండమాల ప్రభాకర్, పాలకుర్తి భాస్కర్‌రావు, పనితి రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాను చెల్లించాలి

ఖమ్మం లీగల్, జనవరి 30 : అనారోగ్య బాధితులకు వైద్య ఖర్చులను బీమా పరిహారం కింద చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్‌పర్సన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవిలత గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. రఘునాథాపాలెం మండలం వేపకుంట్ల గ్రామానికి చెందిన రేమళ్ల వెంకటేష్ స్టార్ హెల్త్ ఎల్లాయిడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా కుటుంబ ఆరోగ్యబీమా పాలసీ 2022లో రూ.9,522 చెల్లించి తీసుకున్నారు. 5లక్షల పరిమితి గల పాలసీ తీసుకున్న కొద్దికాలానికి దురదృష్టవశాత్తు వెంకటేష్ అనారోగ్యం పాలయ్యాడు. వైద్యులు పరిశీలించి ఖమ్మం నగరంలోని ప్రశాంతి ఆసుపత్రికి తరలించి పరీక్షలు నిర్వహించారు. తమ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రకారం.. తనకు ఆసుపత్రిలో వైద్యానికి అయిన ఖర్చులను చెల్లించవలసిందిగా సదరు ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగా వారు నిరాకరించడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌కు ఆశ్రయించాడు. దీంతో వైద్య ఖర్చులు రూ.43,100, ఖర్చుల నిమిత్తం మరో రూ.10 వేలు చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశిస్తూ కమిషన్ తీర్పునిచ్చింది.

నీటి వనరుల ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలి

– కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సమీక్షిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, జనవరి 30 : జిల్లాలో నీటి వనరుల ఆక్రమణలు గుర్తించి ఫిబ్రవరి 12వ తేదీలోగా నివేదిక అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నీటి వనరుల ఆక్రమణ, భూసేకరణపై సంబంధిత అధికారులతోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి మొత్తం 17 కిలోమీటర్లలో 8.5 కిలోమీటర్ల వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, మిగిలిన పట్టా భూమి సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. పట్టాదారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ భూసేకరణ వేగవంతం చేయాలని, రానున్న 15రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని నీటి వనరుల వద్ద ఆక్రమణకు గురైన భూముల వివరాలను రెవెన్యూ మ్యాప్ నీటి పారుదల మ్యాప్, టౌన్‌ప్లానింగ్ రికార్డులను పరిశీలించి సమన్వయంతో గుర్తించి ఫిబ్రవరి 12లోపు వివరాలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

బెటాలియన్‌కు భూమి కేటాయింపు

మామిళ్లగూడెం, జనవరి 30 : జిల్లాలోని రఘునాథపాలెం మండల పరిధిలో సీఆర్‌పీఎఫ్ ట్రాన్సిట్ క్యాంపు కోసం 1.5 ఎకరాల భూమిని కేటాయిస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 141వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ నితీష్ ఠాకూర్‌కు పత్రాలు అందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్, సీఆర్‌పీఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వాడకం చట్టరీత్యా నేరం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కే.మధుమోహన్‌రెడ్డి

సత్తుపల్లిటౌన్, జనవరి 30: మాదక ద్రవ్యాల వాడకం చట్టరిత్యా నేరమని, వీటిని వాడిన ఎదుటివారిని వాడమని ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని యాంటీ నార్కోటిక్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కే.మధుమోహన్‌రెడ్డి, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ వీ.విజయరామారావు, సత్తుపల్లి పట్టణ ఎస్సై కే.రఘు హెచ్చరించారు. గురువారం స్థానిక సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు 'ప్రపంచ మాదక ద్రవ్యాల నిషేధం'ను పురస్కరించుకొని పోలీసు శాఖ, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, కళాశాల యాజమాన్యం సౌజన్యంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు మాదక ద్రవ్యాలపై అవగాహన లేక వీటి వాడకంపై మక్కువ చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి వల్ల తమ జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా వారి తల్లిదండ్రులపై పడి వారి కుటుంబం మొత్తం విచ్చిన్నమవుతుందని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మీరు వాడే ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్ లేక ఎక్స్ మొదలగు సోషల్ మీడియాలో పోస్టులు కానీ, కామెంట్ కానీ పెట్టవచ్చు కానీ ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొట్టడంగా ఉన్న ఎడల అది సైబర్ నేరంగా పరిగణించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి, హెటెరో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా రవికుమార్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పాముల శేఖర్‌బాబు, ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మలచెరువులో నిర్మించిన చేపల చెరువు తొలగింపు

అధికారులకు రైతు సంఘం నుంచి అభినందనలు

కొణిజర్ల, జనవరి 30: మండలంలోని లాలాపురంలో తుమ్మలచెరువు వంద సంవత్సరాల క్రితమే నిర్మాణం జరిగింది. 1950కు ముందు నుంచి రెండు చెరువులు ప్రభుత్వ రికార్డుల్లో చెరువులు నమోదయ్యాయి. కాలక్రమంలో కొందరు రైతులు చెరువులు తమ భూములుగా చిత్రీకరించి పట్టా పాస్‌పుస్తకాలు పొందారు. 2020 తర్వాత రెవెన్యూ వ్యవసాయ, నీటి పారుదల, మున్సిపాలిటీ అనుమతి లేకుండా తమ పొరుగు రైతులు ఎలాంటి అభ్యంతరం లేదని ధ్రువీకరణ పత్రం సమర్పించకుండానే ఏకంగా తుమ్మలచెరువు కట్టకు వంద అడుగుల దూరంలో మరోకట్ట నిర్మాణం చేసి చేపలచెరువు నిర్మాణం చేశారు. తుమ్మలచెరువులో చేపలచెరువు నిర్మాణం తొలగించాలని 2022 నుంచి ఆయకట్టు రైతులు, గ్రామ ప్రజలు సమష్టిగా అధికారులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల క్రితం ఇరిగేషన్, ఫిషరిష్, రెవెన్యూ, పోలీస్ అధికారులు చెరువుకట్టలను తొలగించారు. తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు గురువారం తొలగించిన చేపల చెరువు కట్టలను పరిశీలించారు. మూడున్నర సంవత్సరాల నుంచి రైతులు పోరాటం చేయడంతో చేపల చెరువు కట్టలను తొలగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బొంతు రాంబావు, చింతనిప్పు చలపతిరావు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, సంక్రాంతి నర్సయ్య, సంక్రాంతి పురుషోత్తం, వడ్లముడి మధు, యనమద్ది రామకృష్ణ, మండవ బ్రహ్మేశ్వర రావు, రాందాసు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

తొలగించిన చేపలచెరువు కట్టలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాలు మెరుగ్గా నిర్వహించాలి

– అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, జనవరి 30 : జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో పోషణ్ అభియాన్, ప్రీస్కూల్, అనీమియా నివారణ వివరాలతో జిల్లాలోని సీడీపీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో తక్కువ పనితీరు ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ల హాజరు, పనితీరుపై రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న ప్రతి కార్యక్రమాన్ని ట్రాక్ చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి, సీడీపీవోలు, ఏసీడీపీవోలు, డీఎంసీ డీహెచ్‌ఈడబ్ల్యూ ఎస్డీ సమ్రీన్, అధికారులు పాల్గొన్నారు.

బోధనతోపాటు భవిష్యత్‌పై అవగాహన కల్పించాలి

– డీఈవో సోమశేఖరశర్మ

మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ, డైట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఖమ్మం అర్బన్, జనవరి 30 : ఉపాధ్యాయులు బోధనతోపాటు విద్యార్థులకు భవిష్యత్‌పై అవగాహన కల్పించాలని డీఈవో సోమశేఖరశర్మ సూచించారు. గురువారం నగరంలోని డైట్ కళాశాలలో కెరియర్ కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం ప్రారంభించి ప్రసంగించారు. రెండ్రోజుల శిక్షణలో ప్రభుత్వ, స్థానిక సంస్థల, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, టీఆర్ఈఐఎస్, ఉన్నత పాఠశాలల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష ద్వారా శిక్షణ కల్పిస్తున్నారు. సరైన మార్గాన్ని ఎంచుకునేలా సలహాలు ఇవ్వాలని, ఉన్నతులుగా తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు వారిని తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ, ఏఎంవో కేశవపట్నం రవికుమార్, ఆర్‌పీలు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, సోమలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, సాధిక్ హైమద్, ప్రసాద్, సైదులు, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, సుధీర్, నవీన్, సందీప్, అమీర్‌ఖాన్, సత్యం, రామకృష్ణారెడ్డి, శాంతకుమారి, అలివేలు, రాజారావు, మాధవరావు పాల్గొన్నారు.

డీఈవో అక్రమాలపై విచారణ జరిపించాలి

బోనకల్లు, జనవరి 30: జిల్లా విద్యాశాఖ అధికారి అక్రమాలపై విచారణ జరిపించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ యాకుబ్‌పాషా, దేవ సహాయం, సుజాత, హనుమంతరావు, నర్సింహారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగుల బదిలీ కౌన్సిలింగ్‌లో నిబంధనలకు తూట్లు పొడిచారని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. జిల్లాకు 36 మంది స్పౌజ్ బదిలీల్లో 45 పరస్పర బదిలీల్లో ఖమ్మం జిల్లాకు వస్తే నేటికీ వారికి నియామక ఉత్తర్వులను ఇవ్వలేదన్నారు. గత జూన్ నెలలో జరిగిన బదిలీల్లో హౌస్ పాయింట్లను దుర్వినియోగపరిచిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డిప్యూటేషన్లు పెట్టిన ఉపాధ్యాయుల స్థానాల్లో కొత్త ఉపాధ్యాయులు నియమించినప్పటికీ వారిని మాత్రం రిలీవ్ చేయలేదన్నారు. ఉపాధ్యాయుల బదిలీల్లో నిబంధనలు పాటించని జిల్లా విద్యాశాఖ అధికారిపై విద్యాశాఖలో జరుగుతున్న అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.

రేపు మహిళల క్రికెట్ టోర్నమెంట్


మహిళా క్రికెట్ టోర్నమెంట్ గురించి మాట్లాడుతున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్, జనవరి 30 : తెలంగాణ రాష్ట్ర మహిళల టోర్నమెంట్ తాళ్ళూరి సాహస్ మెమెరియల్ వారి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీన న్యాయవాది తాళ్ళూరి దిలీప్ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర హైకోర్టు జడ్జి సురేపల్లి నందా ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నట్లు టీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు బిచ్చాల తిరుమలరావు, డి.కృష్ణారావు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో రాష్ట్ర మహిళ న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. జిల్లా జడ్జి జి.రాజగోపాల్ ముఖ్యఅతిధిగా పాల్గొంటారని న్యాయవాదులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.